క్లుప్తంగా

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: మార్చి, ఏప్రిల్ మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రాష్ట్రం ప్రకటించిన రూ.10 వేలతో పాటు, కేంద్రం రూ.15 వేలు ఇవ్వాలని, తడిసిన పంటలను మద్దతు ధరలకే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు నెలల్లో కురిసిన వానలు, గాలులకు జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మిర్చితో పాటు మామిడి, బొప్పాయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆ పంటలను మద్దతు ధరలకే ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు నష్టపోయిన పంటలను పూర్తిగా నమోదు చేయటం లేదని, 4 ఎకరాలు పంట కోల్పోతే 1, 2 ఎకరాలు మాత్రమే నమోదు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం టౌన్-1 సెక్షన్ 33/11 కేవీ ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గాంధీచౌక్ 11 కేవీ లైన్ మరమ్మతులు, విద్యుత్ లైన్లకు ఆటకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మౌల్విక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాష్‌నగర్ ఆటోస్టాండ్, పరుచూరి వారి వీధి, బీజాలవారి తోట, జహీర్ పుర స్కూల్ లైన్, సాయిలీల కోల్డ్ స్టోరేజీ లైన్, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వాటర్‌కూలర్ వితరణ

ఖమ్మంలీగల్: జిల్లా బార్ అసోసియేషన్ గేమ్స్ సెక్రటరీ రావుల వెంకట్ గురువారం మహిళా బార్ రూమ్‌కు వాటర్‌కూలర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వెంకట్‌ను అభినందించారు. అలాగే బార్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు జనరల్ సెక్రటరీ మన్నేపల్లి బసవయ్య అన్నారు.

మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ

కూసుమంచి: లోక్యాతండాకు చెందిన మాజీ సర్పంచ్ వడిత్య నాగేశ్వరరావు విగ్రహాన్ని గురువారం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వడిత్య రాంచంద్రు నాయక్, హుజుర్‌నగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సైకిలాబ్ నాయక్, భూక్యా మంజూనాయక్, జంకీలాల్ పాల్గొన్నారు.

ఆంబోతుకు అంత్యక్రియలు

రఘునాథపాలెం: మండలంలోని దొనబండలో ఆంబోత్ గురువారం మృతి చెందింది. ఈమేరకు గ్రామస్తులు ప్రత్యేకపూజలు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. 2009లో మంచుకొండకు చెందిన వాంకుడోత్ లక్ష్మణ్ ఈ ఆంబోతును గ్రామంలో వదిలిపెట్టగా గ్రామస్తులు పూజించారు.

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కర్ణాటక రాష్ట్రంలో మే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారంలో జిల్లాకు చెందిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నేతలు పాల్గొని గురువారం అక్కడ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాకేష్, అరుణోదయ నాయకులు ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

రఘునాథపాలెం: నగరం మీదుగా నిర్మాణానికి నిర్ణయించిన నాగపూర్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలని పలువురు రైతులు కోరారు. రఘునాథపాలెంలో హైవే నిర్వాసిత రైతులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రజా ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు వారి వ్యాపార అవసరాల కోసమే నాగపూర్ - అమరావతి హైవే నిర్మిస్తున్నారని ఆరోపించారు. నగర విస్తరణకు ఆటంకంగా మారనున్నందున తక్షణమే అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. మంద వెంకటయ్య, సుధీర్, శీను, నాగండ్ల శ్రీధర్, పాపినేని వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పీఎస్-2
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఈవిల్ డెడ్ రైజ్
ఆదిత్య	ఏజెంట్
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విడుదల

- ఖమ్మం గాంధీచౌక్

అద్దంలా కాదు.. అధ్వానంగా!

- పెద్దాస్పత్రిలో గుంతలమయమైన రోడ్లు
- దశాబ్దకాలంగా జరగని నిర్మాణాలు
- గతుకులు, గుంతలతో రోగులు, సహాయకుల ఇబ్బందులు


గుంతల్లో పేరుకుపోయిన బురద


ఆస్పత్రి ఆవరణలో గుంతలు తేలిన రహదారి

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వంద పడకలతో 1964లో ఏర్పాటైంది. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా ఆస్పత్రిని ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. తదనంతరం ఆస్పత్రి దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 520 పడకల స్థాయికి చేరింది. తాజాగా ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుమతి లభించింది. ఈ విద్యాసంవత్సరం నుండే ఇక్కడ బోధన ప్రారంభం కానుంది. ఇంతవరకు బాగానే ఉన్నా అంబులెన్స్‌లు, వాహనాల్లో వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా అంతర్గత రోడ్లను ఎప్పటికప్పుడు తీర్చిదిద్దాల్సి ఉంటుంది. కానీ మరమ్మతులు లేక, కొత్త నిర్మాణాలు జరగక రహదారులు అధ్వానంగా కనిపిస్తున్నాయి.

రోజుకు 1,200మందికి పైగానే...

దశాబ్దాల క్రితం ఆస్పత్రిలో వేసిన తారురోడ్డే ఇప్పటికీ దిక్కవుతోంది. అలాగే, చాలాకాలం క్రితమే వేసిన అంతర్గతంగా రోడ్లు సైతం పాడైపోయింది. పూర్తిగా గతుకులు తేలి గుంతలమయమై అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులే కాక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదనే చెప్పాలి. ఖమ్మం జనరల్ ఆస్పత్రి స్థాయి ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. ఇక్కడ వైద్య సేవలు మెరుగుపడటంతో కొన్నేళ్లుగా చికిత్స కోసం వచ్చేవారి తాకిడి పెరిగింది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, కంటి, నెఫ్రాలజీ, యూరాలజీ, కార్డియాలజీ, పాలియేటీవ్, గైనకాలజీ తదితర సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఉమ్మడి జిల్లా నుండే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి ఇక్కడికి వైద్యం కోసం వస్తున్నారు. ఇక్కడకు నిత్యం 1,200 నుండి 1,500 మంది వరకు రోగులు వస్తున్నారు. వీరితో పాటు వచ్చే సహాయకులను కలుపుకుంటే ఈ సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటుంది. వీరు వచ్చివెళ్లే వాహనాలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, అంబులెన్స్‌ల రాకపోకలతో ఇప్పటికే ఛిద్రమైన రహదారులు మరింత గుంతలు తేలుతున్నాయి.

ఇక్కట్లు..

ఆస్పత్రి ఆవరణలో అంతర్గత రోడ్లు సరిగా లేకపోవటంతో వాహనాల్లో వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు గుంతలమయంగా మారిన కారణంగా చిన్నపాటి వర్షానికి సైతం నీళ్లు నిలుస్తున్నాయి. దీంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్య ఏళ్లుగా ఉన్నా ఏ అధికారి కూడా పరిష్కారంపై దృష్టి సారించిన దాఖలాలు లేవనే చెప్పాలి. కనీసం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధులు వినియోగించి రోడ్లు వేయాలన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇకనైనా ఆస్పత్రి అధికారులు మేల్కొని తక్షణం అంతర్గత రోడ్లు వేయించి ఇబ్బందులు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

త్వరలోనే రోడ్ల నిర్మాణం..



ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయటంతో జనరల్ ఆస్పత్రి రూపురేఖలు మారనున్నాయి. త్వరలోనే అంతర్గత రోడ్లు వేయిస్తాము. ప్రస్తుతం పాత కలెక్టరేట్‌లో చేపట్టిన భవనాల ఆధునికీకరణ పనులు వచ్చే నెలలో పూర్తవుతాయి. ఆస్పత్రి అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.3.6 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఆస్పత్రిలో అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపడతాం. ఈ ఏడాది చివరికల్లా ఆస్పత్రి కొత్త రూపురేఖలు సంతరించుకుంటుంది.

– ఎస్.రాజేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

ఉన్నతమైన జీవన విలువలను అలవర్చాలి


జ్యోతి ప్రజ్వలనతో బాలల వికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: బాల్య దశ నుంచే పిల్లలకు ఉన్నతమైన జీవన విధానాన్ని అలవర్చాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అన్నారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని కస్బాబజార్‌లో ఏర్పాటు చేసిన బాలల వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని గురువారం బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ రాజయోగిని అరుణతో కలిసి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేత, డాక్టర్ వికాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బీకే గీత, రాంమ్మోహన్, శ్రీదేవి పాల్గొన్నారు.

మార్కెట్‌లో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ఖమ్మంవ్యవసాయం: ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ కోశాధికారి తల్లాడ రమేష్ ఆధ్వర్యాన మజ్జిగ ప్యాకెట్లను రైతులు, కార్మికులకు అందజేశారు. మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేషం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, కలువకుంట్ల గోపాల్‌రావు, అంకిత మహేందర్, ముత్యం ఉప్పల్‌రావు, యడ్లపల్లి సతీష్ కుమార్, దొంగరి నాగరాజు, కైలాసపు వేణుగోపాల్‌రావు, వరపర్తి శ్రీనివాస్‌రావు, కాకరపర్తి రమేష్, రామారావు పాల్గొన్నారు.

చురుగ్గా ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు పనులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై నందమూరి తారకరామారావు 54 అడుగుల విగ్రహం ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, కమ్మ సంఘం నగర అధ్యక్షుడు వల్లభినేని రామారావుతో పాటు గరికపాటి వెంకటేశ్వరరావు తదితరులు గురువారం పరిశీలించి మాట్లాడారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా శ్రీకృష్ణుడి రూపంలోని ఆయన విగ్రహాన్ని వచ్చేనెల 28న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరిపూడి సతీష్, చిరుమామిళ్ల రవికిరణ్, బత్తుల మురళి, పైడిపల్లి సత్యనారాయణ, వడ్లముడి గోపాల్‌రావు, ప్రసాద్, గోపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఢిల్లీలో రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ని అరెస్ట్ చేసి, చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ డిమాండ్ చేశారు. రెజ్లర్లపై లైంగిక వేధింపులను నిరసిస్తూ ఐద్వా, డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం దిష్టిబొమ్మ దహనం చేశారు. పొన్నం వెంకటేశ్వరరావు, బషీరుద్దీన్, టి.ప్రవీణ్, బండి పద్మ, చింతల రమేష్, సత్యనారాయణ, భూక్యా వీరభద్రం, రమణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ అన్నారు. వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ... కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి రెండు సార్లు మైనార్టీ బిడ్డను ఓడించారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఆమెతో ఉంటున్న వారు మంత్రిని విమర్శించడం గర్హనీయమన్నారు. ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. నాయకులు ఇషాక్, షకీనా, షంషుద్దీన్, మజీద్, అబ్దుల్ ముజాహిద్, ఎండీ.ఫయాజ్, అబ్బాస్, ఫరీద్ ఖాద్రీ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


ఖమ్మంరూరల్: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ఖమ్మంరూరల్: తడిసిన, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని భారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గుర్రాలపాడులో అకాల వర్షాలకు కుల్లాల్లో తడిసిన ధాన్యాన్ని ఆయన రైతుసంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. బందెల వెంకయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, సీవై. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలం లోని గువ్వలగూడెంలో తడిసిన ధాన్యాన్ని అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్యపరిశీలించారు. రైతుల తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సీ.వై.పుల్లయ్య, రైతులు శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి


కామేపల్లిలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కామేపల్లి(కారేపల్లి): అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కామేపల్లి మండలంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడగా నాయకులు కోలా అప్పారావు, దర్గయ్య, షేక్ హోలీభాయ్, రాములు పాల్గొన్నారు.

'భక్త రామదాసు' పాలకవర్గ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న పూర్ణచందర్‌ప్రసాద్

నేలకొండపల్లి: భక్తరామదాసు సర్వీస్ సొసైటీ పాలకవర్గ బాధ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక వాసవీభవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అనంతరం అధ్యక్షుడుగా పాలడుగు పూర్ణచందర్‌ప్రసాద్, కార్యదర్శిగా యలమద్ది లెనిన్, కోశాధికారిగా తెల్లగొర్ల లింగస్వామి ప్రమాణస్వీకారం చేశారు.ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎస్‌టీఓ కే.వీ.కృష్ణారావు, సొసైటీ ప్రతినిధులు వి.భాస్కర్‌రావు, వెల్లంపల్లి శ్రీనివాస్, కొండలరావు, రఘుపతిరావు, మచ్చా రేణుక, నెల్లూరి వీరబాబు, చావా గణపతిరావు, నూతక్కి ప్రసాద్, నంచర్ల దేవీప్రసాద్, కె.నారాయణరావు, వెంకటరమణగుప్తా, ప్రభావతి, లక్ష్మి, భువనగిరి యుగేందర్, కడియాల నరేష్ పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు పరిశీలన

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ గురువారం పరిశీలించారు. సర్వే నంబర్ 101లో ఉన్న వంద ఎకరాలకు పైగా భూములకు సంబంధించి రైతులు కలెక్టర్ గౌతమ్‌ను కలిసి తమకు హక్కులు కల్పించాలని, భూసమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో తహసీల్దార్ నర్సింహారావు, సర్వేయర్ శ్రీను, ఆర్ఐ ప్రవీణ్‌తో ఆర్డీఓ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరిలో రైతు పి.నాగయ్యకు చెందిన పాడిగేదె గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. సమీప పొలం ఫెన్సింగ్‌పై విద్యుత్ తీగ తెగిపడి ఉంది. ఆ ఫెన్సింగ్ వైరును గేదె తాకడంతో షాక్ గురై మృతి చెందింది. రూ.70వేల మేర విలువైన గేదెను కోల్పోయిన తనను ఆదుకోవాలని రైతు కోరారు.

పోరాటాలకు మార్గదర్శకుడు గ్రాంసీ

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక పోరాటాలపై సైద్ధాంతిక అవగాహన కల్పించడంలో ఆంటోనియో గ్రాంసీ మార్గదర్శకుడిగా నిలిచారని విద్యావేత్త ఐ.వీ.రమణారావు అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో కమ్యూనిస్టు నాయకుడు ఆంటోనియో గ్రాంసీ వర్ధంతి సభ గురువారం నిర్వహించగా రమణారావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై.విక్రం, యర్రా శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న శిరీష

నేలకొండపల్లి: ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే వారి సంఖ్యను పెంచాలని అదనపు డీఆర్‌డీఓ శిరీష ఆదేశించారు. మండలంలోని కోనాయిగూడెం, ఆరెగూడెం గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. మస్టర్‌ను తనిఖీ చేశారు. కూలీల చేసిన పనిని కొలతలు చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతీ పంచాయతీ లో కూలీల సంఖ్య ను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా నర్సరీలో మొక్కలు ఎండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఈజీఎస్ ఏపీఓ సునీత, సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, ఉప సర్పంచ్ వడ్లమూడి నర్సయ్య, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజా, ఫీల్డ్ అసిస్టెంట్ తిగుళ్ల భాస్కర్, సీనియర్ మేట్లు వడ్లమూడి శ్రీను, వడ్లమూడి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టంపై అధికారుల పరిశీలన


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను గురువారం సీపీఓ శ్రీనివాస్ ఖమ్మం ఏడీఏ శ్రీనివాస్‌లు మండలంలోని ఎదుళ్లచెరువు, ముజాహిదిపురం గ్రామాలలో మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఏఈఓలు పంట నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చెయ్యగా సీపీఓ శ్రీనివాస్ వాటిని మరోసారి పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు. మండలంలోని ముజాహిదిపురంలో వడగళ్ల వానతో నష్టపోయిన వరి పంటను కూడా అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈఓలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో ఉద్యమించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కార్మికులకు కనీస వేతనాలు పెంపునకు మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. గురువారం నగర కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం బైపాస్‌రోడ్‌లో కార్మికులతో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్ అమలు నిలుపువేతకై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, వెంకన్న, శ్రీను, రమేష్, లక్ష్మీనారాయణ, రాంబాబు, భద్రం, నాగరాజు, సురేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపాధి హామీ పథకంకు నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే బెంగాల్‌లో పథకం ఎత్తి వేశారని, తెలంగాణలో కూడా ఎత్తివేయాలని బీజేపీ యత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు బండి రమేష్, సంగయ్య, వెంకటేశ్వరావు, నరసయ్య, నాగేశ్వరరావు, వెంకటేష్, వెంకన్న, ఎంపీటీసీ షేక్ ఇమామ్, రామ్మూర్తి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

కూసుమంచి: మే 7న హైద్రాబాద్‌లో బీఎస్పీ అధినేత్రి మాయావతి పాల్గొనే బహిరంగసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి బి.ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలు బహుజన సాధికారత కోసం పోరాడాలన్నారు. జిల్లా మహిళా కన్వీనర్ ఉప్పల మంజుల, పాలేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ స్వేరో, మండలాధ్యక్షుడు సాయిచరణ్, నాయకులు బాబురావు, నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ జెండా పండుగ

ఖమ్మం వైరారోడ్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు ఉప్పల వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన బీఆర్ఎస్ ఆధ్వర్యాన రాష్ట్రాభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, మందడపు శంకరరావు, లింగనబోయిన సతీష్, ముత్యాల అప్పారావు, ఆసిఫ్ అహ్మద్, బురాన్, నెమలికొండ వంశీ, ఈదుల రాజేష్, హన్మంతరావు, రాకేష్, చంటి, బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అఖండజ్యోతి ప్రజ్వలన వ్రతం ప్రారంభం


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని టేకులపల్లిలో 49రోజుల పాటు జరిగే అఖండజ్యోతి ప్రజ్వలన వ్రతం పూజలు గురువారం మొదలయ్యాయి. ఈమేరకు రామసీతమ్మ - హరిప్రసాద్‌రావు ప్రాంగణానికి ఆధ్మాతిక గురువు రాంజీ భక్తుల ర్యాలీ నడుమ చేరుకుని వ్రతాన్ని ఆరంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణతో పాటు కొతవరపు సునందకుమారి, సుబ్రహ్మణ్యం, పాదిల కన్నయ్య, గెల్లా లక్ష్మీనారాయణ, వనం కృష్ణవేణి, కే.వీ.చారి, గణేష్‌కుమార్, వరప్రసాద్, గోపాలరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వేసవి సెలవుల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఉపేందర్, మస్తాన్‌లు మాట్లాడుతూ... జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు నిబంధలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగర్, గోపి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కంపు కొడుతోంది..



నగరంలోని 44వ డివిజన్ పాత సీపీఎం కార్యాలయం రోడ్డులో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. ఇక్కడి పాలకులు పట్టింపు లేకపోవడం, కార్మికుల అలసత్వంతో డ్రెయినేజీల్లో మురుగు బయటకుపోయే పరిస్థితి లేదు. రోడ్డుపై వేసిన మురుగు, తాగి పడేసిన కొబ్బరి బొండాలతో చెత్త కుప్పగా మారినా.. ఎత్తేవారే కరువయ్యారు. ఇక ఆస్పత్రులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. వైద్యం కోసం వచ్చే రోగులు, ఇతరులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతూ.. నగరంలోని దుర్వాసన, మురుగు అంతా ఇక్కడే ఉందా? అని చర్చించుకుంటున్నారు.

- ఖమ్మంమయూరిసెంటర్

ప్రశ్నించాల్సిన అధికారి : వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
సెల్ నంబర్ : 79012 98257